E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD    సంపుటి :01    సంచిక :216    గురువారం 16 జూలై 2026    ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్    పేజీలు: 04    వెల :05/-

## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు


2 లో

7 కీలక నిర్ణయాలకు ఆమోదం

సెమికాన్ 2.0కు రూ.1.27 లక్షల కోట్లు

మొబైల్ పీఎల్ఐ రెండో విడతకు గ్రీన్ సిగ్నల్

వారణాసి ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం

రైల్వే నెట్‌వర్క్ ఆధునికీకరణకు భారీ ప్రణాళిక

## అమల్లోకి భారత్ - యూకే ఫ్రీ ట్రేడ్ డీల్


2 లో

99% ఎగుమతులకు జీరో డ్యూటీ

భారతీయ ఉత్పత్తులకు భారీ ఊతం

ఐటీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

సోషల్ సెక్యూరిటీలో భారీ ఊరట

లగ్జరీ కార్ల ధరలు తగ్గనున్నాయి

ద్వైపాక్షిక వాణిజ్యానికి కొత్త ఊపు

**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** భారత్ - బ్రిటన్ దేశాల మధ్య కుదిరిన చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నేటి నుండి అధికారికంగా అమల్లోకి వచ్చింది. ఇటీవల జరిగిన జీ7 సదస్సులో భాగంగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో భారత ప్రధాని నరేంద్ర మోడీ జరిపిన ద్వైపాక్షిక భేటీ అనంతరం ఈ ఒప్పందానికి సంబంధించిన తుది ఆమోదం లభించింది. ఈ ఒప్పందం ద్వారా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సరికొత్త గరిష్ఠాలకు చేరుకోవడమే కాకుండా, ఎగుమతి-దిగుమతి సుంకాలు భారీగా తగ్గనున్నాయి. అలాగే రెండు దేశాల మధ్య ట్రేడ్ వాల్యూ 2030 నాటికి 56 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు పెంచడమే ఈ ఒప్పందం మరో కీలక లక్ష్యం కూడా.

## అద్దంకి, బల్మూరికి మంత్రి హోదా

ప్రభుత్వ విప్‌లకు కీలక గుర్తింపు

ప్రోటోకాల్ అమలుకు ఆదేశాలు

జీవో విడుదల చేసిన ప్రభుత్వం

కాంగ్రెస్ సేవలకు గుర్తింపు

భవిష్యత్ నాయకులకు ప్రోత్సాహం

పదవీకాలమంతా మంత్రి హోదా

2 లో

## "ప్రభుత్వ లాంఛనాలు అక్కర్లేదు" ముద్రగడ ఫ్యామిలీ

కిర్లంపూడిలో అంతిమయాత్ర

వ్యక్తిగతంగా అంత్యక్రియల నిర్వహణ

ముద్రగడకు నివాళుల వెల్లువ

జక్కంపూడి రాజా కీలక వ్యాఖ్యలు

కూతురుకు దక్కని కడచూపు

విషాదంలో కిర్లంపూడి


2 లో

## సీఈవో పోస్టుకు భారీ స్పందన

24 గంటల్లోనే 1,000 దరఖాస్తులు

రామాలయ సీఈవో పోస్టుకు భారీ పోటీ

జూలై 18తో దరఖాస్తుల గడువు

జూలై 19న ఎంపిక కమిటీ సమావేశం

20 ఏళ్ల అనుభవం తప్పనిసరి

జూలై 22న ట్రస్ట్‌కు ప్రగతి నివేదిక

## భారత్‌కు ఊరట

### భారీగా టారిఫ్‌లు తగ్గించిన రష్యా

500% నుంచి 100%కు సుంకాల తగ్గింపు

రష్యా ఇంధన దిగుమతిదారులకు ఊరట

రష్యా బ్యాంకులు, షాడో ఫ్లీట్‌పై ఆంక్షలు

ట్రంప్‌కు ప్రత్యేక మినహాయింపు అధికారాలు

అమెరికా కొత్త ఆంక్షల బిల్లు సంచలనం

2 లో

## ఫారాల నత్తనడక



- 49.28 శాతం మాత్రమే సమర్పణ
- పది రోజుల్లో పూర్తి సాధ్యమేనా?
- ఫారం ఇస్తేనే ఓటు హక్కు
- సీఈవో కీలక హెచ్చరిక జారీ
- హైదరాబాద్‌లో అత్యల్ప స్పందన
- మేడ్చల్‌లో కేవలం 18 శాతం
- గడువు పెంపుపై ఉత్కంఠ కొనసాగింపు
- బీఎల్ఓలకు వెంటనే ఫారాలు ఇవ్వండి

**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** రాష్ట్రంలో ఎస్ఐఆర్ కొనసాగుతోంది. అయితే మొత్తం 3,38,26,448 మంది ఓటర్లకు గాను 3,38,21,554 మందికి(99.99శాతం)ఎన్నికల అధికారులు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. కానీ తిరిగి బీఎల్ఓలకు అందజేసే కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. ఇప్పటివరకు 1,66,70,610మంది ఓటర్లు మాత్రమే (49.28శాతం) తమ ఫారాలను అందజేశారు. దీంతో మరో 50శాతం మంది ఓటర్లు పది రోజుల్లో ఇవ్వడం సాధ్యమేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ గడువు పెంచాలని అన్ని రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

**49.2 శాతం మాత్రమే..**

రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారాలను 49.2శాతం మంది ఓటర్లు మాత్రమే బీఎల్ఓలకు అందజేశారు. కొమురం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, నల్లగొండ, యాదాద్రి-భువనగిరి జిల్లాల్లో మాత్రమే 70శాతానికిపైగా ఓటర్లు తిరిగి ఫారాలను అందజేశారు. నిర్మల్, కామారెడ్డి, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, మెదక్, జోగులాంబ గద్వాల, జనగాం, ఖమ్మం, నారాయణపేట్ జిల్లాల్లో 60శాతానికిపైగా మంది ఇచ్చారు. రంగారెడ్డి జిల్లాలో 33శాతం, హైదరాబాద్ జిల్లా 22 శాతం, అత్యల్పంగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 18శాతం మంది మాత్రమే ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్ఓలకు అందజేశారు. అయితే ఇప్పటివరకు వచ్చిన ఫారాల్లో మరణించిన ఓట్లు, వేరేప్రాంతాలకు చెందిన ఓటర్లు మాత్రమే అందజేసినట్లు తెలుస్తోంది.

మిగతాది 2 లో..

## డెల్టాకు జీవనాడిగా పట్టిసీమ

పట్టిసీమపై చంద్రబాబు ప్రశంసలు

450 టీఎంసీల గోదావరి జలాల తరలింపు

నదుల అనుసంధానంపై కీలక వ్యాఖ్యలు

అమరావతి అభివృద్ధిపై స్పష్టత

రాయలసీమకు పటిష్ట నీటి ప్రణాళిక


2 లో

**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పరిధిలోని కృష్ణా-గోదావరి పవిత్ర సంగమ క్షేత్రం వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించి, నదీమతల్లులకు జలహారతి ఇచ్చారు. అనంతరం సాగునీటి రంగానికి విశేష సేవలు అందించిన ప్రముఖ ఇంజనీర్ కేఎల్ రావు 124వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇంజనీరుగా కేఎల్ రావు అందించిన స్ఫూర్తిని రాష్ట్రంలోని ప్రతి గ్రామానికీ తీసుకెళ్లేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు.

## ఉద్యమానికి సిద్ధం

ఆక్వా రైతులతో జగన్ సమావేశం

ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

సిండికేట్‌పై జగన్ ఆరోపణలు

'అప్పుడా'ను గుర్తు చేసిన జగన్


2 లో

**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** రాష్ట్రంలో ఆక్వా రంగం సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోందని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఆక్వా రైతులు, రైతు ప్రతినిధులతో జరిగిన సమావేశంలో కూటమి ప్రభుత్వంపై ఆయన తీవ్రమైన విమర్శలు చేశారు. అక్వా రైతులు దీనావస్థలో ఉన్నా ప్రభుత్వానికి 'దున్నపోతు మీద వాన పడినట్టు' ఉందని జగన్ మండిపడ్డారు. దాదాపు ఐదు లక్షల మందికి జీవనోపాధి కల్పిస్తున్న ఈ రంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని జగన్ ఆరోపించారు.

సిండికేట్‌గా చంద్రబాబు నాయుడి సానుభూతిపరులు

సీఎం చంద్రబాబు నాయుడి సానుభూతిపరులే సిండికేట్‌గా ఏర్పడి రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని జగన్ విమర్శించారు.

## 23 పంచాయతీలకు ఐఎస్‌వో గుర్తింపు

కమిషనర్ కృష్ణతేజ అభినందనలు

పారదర్శక పాలనకు అంతర్జాతీయ గుర్తింపు

నాణ్యమైన సేవలకు ఐఎస్‌వో సర్టిఫికేషన్

కేరళ తరహాలో పంచాయతీరాజ్ లక్ష్యం

## డిశ్చార్జ అయిన పవన్ కళ్యాణ్


2 లో

భుజాల శస్త్రచికిత్స విజయవంతం

మరికొన్ని రోజులు పూర్తి విశ్రాంతి

త్వరగా కోలుకోవాలని చంద్రబాబు ఆకాంక్ష

'వెల్‌కమ్ బ్యాక్' అంటూ అభిమానుల సందడి

త్వరలో ప్రజాక్షేత్రంలోకి పవన్ రీఎంట్రీ

# అమల్లోకి భారత్ - యూకే ఫ్రీ ట్రేడ్ డీల్..

**మొదటి పేజీ తరువాయి**

భారతీయ ఎగుమతులపై 'జీరో డ్యూటీ'

ఈ ఒప్పందం ప్రకారం భారతదేశం నుండి బ్రిటన్‌కు ఎగుమతి అయ్యే 99% పైగా వస్తువులపై యూకే ప్రభుత్వం పూర్తి సుంకం రాయితీ కల్పించింది. దీనివల్ల యూకే మార్కెట్‌లో భారతీయ వస్తువుల ధరలు గణనీయంగా తగ్గి, చైనా మరియు ఇతర దేశాల ఉత్పత్తులతో పోటీ పడేలా మన ఎగుమతులు పెరగనున్నాయి. ప్రధానంగా టెక్స్‌టైల్స్, గార్మెంట్స్ లోని భారతీయ చేనేత, వస్త్ర రంగానికి భారీ ఊతం లభిస్తుంది. తోలు వస్తువుల ఎగుమతులు పుంజుకుంటాయి. రత్నాలు, ఆభరణాల రంగానికి సరికొత్త మార్కెట్ లభిస్తుంది. పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతి సులభతరం అవుతుంది. సముద్ర ఆహార ఉత్పత్తులు, ప్యాక్డ్ ఫుడ్స్‌కు డిమాండ్ పెరుగుతుంది.

సర్వీసెస్ సెక్టర్, 'సోషల్ సెక్యూరిటీ' నిబంధన

కేవలం వస్తువుల మార్పిడి మాత్రమే కాకుండా, సేవల రంగంలో ఈ ఒప్పందం భారతీయులకు పెద్ద ఊరటనిచ్చింది. ఐటీ నిపుణులు, ఇంజనీర్లు, డాక్టర్లు, ఇతర నైపుణ్యం కలిగిన ప్రొఫెషనల్స్‌కు బ్రిటన్‌లో ఉపాధి అవకాశాలు సులభతరం అవుతాయి. సోషల్ సెక్యూరిటీ అగ్రిమెంట్ ప్రకారం యూకేలో తాత్కాలిక ప్రాజెక్టుల కోసం పని చేసే భారతీయ ఉద్యోగులు 5 సంవత్సరాల వరకు డబుల్ సోషల్ సెక్యూరిటీ కంట్రిబ్యూషన్ అంటే రెండు దేశాల్లోనూ చెల్లించే సామాజిక భద్రతా పన్నులు ఇకపై చెల్లించాల్సిన అవసరం లేదు. దీనివల్ల భారతీయ కంపెనీలకు, ఉద్యోగులకు భారీగా ఖర్చు తగ్గుతుంది.

ఏ వస్తువుల ధరలు తగ్గుతాయి?

బ్రిటన్ నుండి భారతదేశానికి దిగుమతి అయ్యే వస్తువుల పన్నులలో మార్పులు చేయడం వల్ల భారతీయ మార్కెట్లో ఉత్పత్తుల ధరలు తగ్గనున్నాయి. పరిశ్రమల్లో వాడే అత్యాధునిక బ్రిటీష్ యంత్రాల, వాటి విడి భాగాల ధరలు తగ్గుతాయి. బ్రిటన్ నుండి వచ్చే లగ్జరీ కార్లు, ఇతర వాహనాల ధరలు భారీగా తగ్గనున్నాయి. యూకేకు చెందిన బ్రాండెడ్ ఆహార పదార్థాలు, చాక్లెట్లు, పండ్ల ధరలు దిగివస్తాయి.

# డెల్టాకు జీవనాడిగా పట్టిసీమ

**మొదటి పేజీ తరువాయి**

డెల్టాను సస్యశ్యామలం చేసింది ఆయనే..

దేశంలో శ్రీశైలం, నాగార్జున సాగర్, హీరాకుడ్, కోసీ వంటి ప్రధానమైన డ్యామ్‌ల నిర్మాణంలో కేఎల్ రావు కీలక పాత్ర పోషించారని సీఎం చంద్రబాబు కొనియాడారు. విజయవాడలో పుట్టి, ఎంపీగా గెలిచి, ముగ్గురు ప్రధానమంత్రుల వద్ద కేంద్రమంత్రిగా పనిచేసిన ఆయన.. ఐక్యరాజ్యసమితి తరఫున అంతర్జాతీయ జల నిపుణుడిగా ఈజిప్ట్, సూడాన్ లాంటి దేశాల్లోనూ సేవలు అందించారని గుర్తుచేశారు. నాడు సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం, ప్రకాశం బ్యారేజీలను నిర్మిస్తే, కేఎల్ రావు వాటిని ఆధునీకరించి డెల్టాను సస్యశ్యామలం చేశారన్నారు. శివరామకృష్ణయ్య, కేఎల్ రావుల తర్వాత ఆంధ్రప్రదేశ్ సాగునీటి రంగంపై ఆలోచించిన వ్యక్తి ఎన్టీఆర్ అని, సాగునీటి రంగాన్ని తీర్చిదిద్దటంలో వీరంతా తనకు ఎంతో స్ఫూర్తినిచ్చారని సీఎం పేర్కొన్నారు.

పట్టిసీమ రాకపోయుంటే..

శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు కృష్ణా నది నుంచి నీటి ప్రవాహం తగ్గి పంట సీజన్ మారిపోతున్న తరుణంలో, రైతులు తుపాన్ల బారిన పడి నష్టపోకుండా రక్షించాలనే ఉద్దేశంతోనే తాము పట్టిసీమ ప్రాజెక్టును చేపట్టామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నాడు పట్టిసీమను కొందరు వట్టిసీమ అని అవహేళన చేశారని, ప్రాజెక్టు దండగ అన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే 2014లో విభజన తర్వాత తాము బస్సులోనే బస చేసి, పట్టుదలతో కేవలం 1300 కోట్ల రూపాయల ఖర్చుతో పట్టిసీమను పూర్తి చేశామని గుర్తుచేశారు. గడిచిన 2015 నుండి 2025 వరకు పట్టిసీమ ద్వారా 450 టీఎంసీల గోదావరి జలాలను తరలించామని, నీల వర్ణంలోని కృష్ణా జలాలు, అరుణ వర్ణంలోని గోదావరి జలాలు కలిసి ఈ ప్రాంతంలో బంగారం పండించాయని హర్షం వ్యక్తం చేశారు. ఏటా సగటున 2 వేల టీఎంసీల గోదావరి నీరు సముద్రంలో వృథాగా కలుస్తోందని, పట్టిసీమ నీరే రాకపోతే.. నేడు కృష్ణా డెల్టా పరిస్థితి ఏమిటో అందరూ ఆలోచించాలన్నారు.

సీమకోసం ప్రత్యేక చర్యలు

నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాము హైటెక్ సిటీ నిర్మిస్తుంటే దండగ అన్నారని, కానీ తాము ధైర్యంగా ముందుకు వెళ్లబట్టే నేడు హైదరాబాద్ ఐటీకి అంతర్జాతీయ కేంద్రంగా నిలిచిందని సీఎం గుర్తుచేశారు. ఇప్పుడు అమరావతిని కూడా అద్భుతమైన నగరంగా నిర్మిస్తుంటే కొందరు అడ్డుపడుతున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలోని కొందరు రాజకీయం కోసం రైతుల్ని రెచ్చగొట్టి చివరకు సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణాన్ని కూడా అడ్డుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. దేశంలో నదుల అనుసంధానం జరిగితే అద్భుతమైన అవకాశాలు ఉంటాయని, గోదావరి–కావేరి అనుసంధానాన్ని కేఎల్ రావు నాడే ప్రతిపాదించగా, వాజపేయి హయాంలో గంగా–కావేరి అనుసంధానం కోసం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం వాగులు, వంకలు, నీటి ఊటలు అడుగంటిపోతున్న తరుణంలో భూగర్భ జలాలను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారిపోకుండా పటిష్ట చర్యలు చేపట్టామని సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు.

# అద్దంకి, బల్మూరికి మంత్రి హోదా



**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ప్రభుత్వ విప్ లుగా ఉన్న ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ లకు రాష్ట్ర మంత్రి హోదా ఇచ్చింది. ఈ మేరకు అధికారులు ప్రోటోకాల్ పాటించాలని కూడా ఆదేశాలు జారీ అయ్యాయి. ఏప్రిల్ లోనే అప్పటి సీఎస్ రామకృష్ణారావు పేరుతో జీవో రూపొందింది. అయితే అదే జీవోను తాజాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రిలీజ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అద్దంకి దయాకర్ పాత్ర చాలా కీలకమైంది.

అలాగే రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఆయనకు పేరు ఉంది. ఇటు బల్మూరి వెంకట్ విద్యార్థి నాయకుడిగా ప్రతిపక్షంలో కాంగ్రెస్ ఉన్నప్పుడు అనేక పోరాటాలు చేశాడు. జైల్లో పడ్డాడు. కేసీఆర్ సర్కార్ వైఫల్యాలను ఎండగట్టాడు. నిత్యం కాంగ్రెస్ కోసం పనిచేస్తూ, పార్టీని ముందుకు నడిపించాడు. ఈ క్రమంలోనే ఈ ఇద్దరు భవిష్యత్తు లీడర్లకు కేబినెట్ హోదా కల్పించింది రేవంత్ రెడ్డి సర్కార్. దీంతో పార్టీ కోసం కష్టపడ్డ వాళ్లకు పదవులు దక్కుతాయని కాంగ్రెస్ మరోసారి నిరూపించినట్లు కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు. కాగా, ఎమ్మెల్సీ పూర్తి పదవీకాలం పాటు మంత్రి హోదా అమల్లో ఉంటుందని ఉత్తర్వులు జారీ కావడం గమనార్హం.

# 23 పంచాయతీలకు ఐఎస్‌వో గుర్తింపు

**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** రాష్ట్రంలో 23 పంచాయతీలకు ఐఎస్‌వో గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ సిబ్బందిని అభినందించారు. పంచాయతీల పాలనలో పారదర్శకత, నాణ్యమైన సేవలకు గుర్తింపు దక్కిందన్నారు. మెరుగైన రికార్డుల నిర్వహణ, త్వరితగతిన ధృవపత్రాల జారీకి గుర్తింపు దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పంచాయతీలకు లభించిన ఈ ఐఎస్‌వో సర్టిఫికేషన్, భవిష్యత్తులో మరింత మెరుగ్గా పనిచేసేందుకు ఒక గొప్ప ప్రోత్సాహకరంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని పంచాయతీరాజ్ శాఖను కేరళ తరహాలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నట్లు కమిషనర్ కృష్ణతేజ ఈ సందర్భంగా వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పాలనను మరింత పటిష్టం చేసి, ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు.

# ఉద్యమానికి సిద్ధం

**మొదటి పేజీ తరువాయి**

ఈ సిండికేట్ చేతుల్లో ఆక్వా రైతులు నలిగిపోతున్నారని, ఫీడ్, సీడ్ ధరలను వారే ఇష్టానుసారంగా నిర్ణయిస్తున్నారని మండిపడ్డారు. ఫీడ్ ధరలను కేజీకి రూ.14 నుంచి రూ.16 వరకు పెంచేసి, కేవలం రూ.2 తగ్గించి చేతులు దులుపుకోవడం రైతులను అవమానించడమేనన్నారు. చంద్రబాబు అధికారంలో ఉంటే ఇలాంటి సిండికేట్‌లకే పండగ అని, రైతన్నలకు మాత్రం కన్నీరే మిగులుతుందని జగన్ ఎద్దేవా చేశారు.


మా హయాంలో 'అప్సడా' ఏర్పాటు చేశాం

ఆక్వా రైతులకు అండగా ఉండేందుకు తమ హయాంలో 'అప్సడా' ను ఏర్పాటు చేశామని జగన్ గుర్తు చేశారు. తద్వారా సీడ్, ఫీడ్, మార్కెటింగ్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించామని ఆయన చెప్పారు. కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని పూర్తిగా నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. రైతుల కోసం 35 ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశామని, ఆర్బీకేల పరిధిలో ఫిషరీస్ అసిస్టెంట్‌లను నియమించామని ఆయన తెలిపారు. నరసాపురంలో తాము తీసుకొచ్చిన ఫిషరీస్ వర్సిటీని, భీమవరంలో మెడికల్ కాలేజీ పనులను సైతం చంద్రబాబు ప్రభుత్వం నిలిపివేసిందని జగన్ ఆరోపించారు.

ఆక్వా రైతుల కష్టాలు నాకు తెలుసు

ఆక్వా రైతుల కష్టాలు తనకు తెలుసని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని జగన్ భరోసా ఇచ్చారు. రైతులకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ తరఫున ఉద్యమబాట పడతామని ఆయన స్పష్టం చేశారు. మరో మూడేళ్లలో మళ్లీ రైతు ప్రభుత్వం వస్తుందని దీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు సిండికేట్‌ను కూకటివేళ్లతో పీకేస్తామని హెచ్చరించారు. మళ్లీ 'అప్సడా'కు పూర్వ వైభవం తీసుకువస్తామని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు.

## "ప్రభుత్వ లాంఛనాలు అక్కర్లేదు" : ముద్రగడ ఫ్యామిలీ




**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** కాపు సామాజికవర్గ అగ్రనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను రాష్ట్ర ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించాలన్న ప్రతిపాదనను ఆయన కుటుంబ సభ్యులు తిరస్కరించారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ముద్రగడ కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని తుది వీడ్కోలు నిమిత్తం కాకినాడ జిల్లాలోని ఆయన స్వస్థలమైన కిర్లంపూడికి తరలించారు. అయితే ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను ప్రభుత్వ గౌరవ సూచికంగా అధికారిక లాంఛనాలతో జరుపుతామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఆయన కుటుంబం దీనికి నిరాకరించింది. ఈ నిర్ణయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జక్కంపూడి రాజా మీడియా వేదికగా అధికారికంగా వెల్లడించారు. ముద్రగడ పద్మనాభం బతికి ఉన్నంత కాలం రాజకీయంగా, వ్యక్తిగతంగా అనేక రకాలుగా వేధింపులకు గురిచేసి, అవమానించిన వారు.. ఇప్పుడు ఆయన మరణించాక లేని సానుభూతిని ప్రదర్శిస్తూ అధికారిక లాంఛనాలు అనడం తమకు ఎంతమాత్రం అవసరం లేదని కుటుంబ సభ్యులు స్పష్టం చేసినట్లు రాజా పేర్కొన్నారు. ముద్రగడ తన జీవితంలో ఎన్నడూ పదవుల కోసమో, తాత్కాలిక గొప్పల కోసమో పాకులాడలేదని, ప్రజా పక్షాన పోరాడిన నిఖార్సైన నేతగా నిలిచారని ఆయన కొనియాడారు.

కూతురుకు దక్కని కడచూపు

ఇదిలావుండగా కన్నతండ్రిని కడసారి చూసుకునేందుకు హైదరాబాద్ నుండి కిర్లంపూడికి తరలివచ్చిన ముద్రగడ కుమార్తె క్రాంతిశీలను ఆమె తల్లితో పాటు అక్కడ ఉన్న ముద్రగడ అభిమానులు, అనుచరులు తీవ్రంగా ప్రతిఘటించారు. గతంలో తండ్రితో వచ్చిన విభేదాలు, రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆగ్రహంతో ఉన్న కుటుంబ సభ్యులు ఆమెను అంత్యక్రియల ప్రాంగణంలోకి రాకుండా, భౌతికకాయాన్ని చూడకుండా గేట్ల వద్దే అడ్డుకుని వెనక్కి పంపించివేశారు. దశాబ్దాల పాటు కాపు రిజర్వేషన్ల పోరాటమే ఊపిరిగా బతికిన ఒక శకం ముగియడంతో కిర్లంపూడి పరిసర ప్రాంతాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు కేవలం సాంప్రదాయబద్ధంగా, వ్యక్తిగత పద్ధతిలోనే ఆయన అంత్యక్రియల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# ఫారాల నత్తనడక

**మొదటి పేజీ తరువాయి**



ముఖ్యంగా రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలకు చెందిన ఓటర్లు ఓటెయ్యడంలోనూ, ఓటును కాపాడుకోవడంలోనూ వెనుకబడే ఉన్నారని విమర్శలూ లేకపోలేదు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో 14రోజుల పాటు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పొడిగించిన నేపథ్యంలో రాష్ట్రంలో పొడిగించే అవకాశాలు ఉన్నాయా? లేదా? అనేది వేచి చూడాల్సిందే.

**ఫారం ఇస్తేనే ఓటు హక్కు : సీఈవో సి.సుదర్శన్‌రెడ్డి**

పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌ఓలకు ఇస్తేనే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఓటరు పేరు నమోదు అవుతుందని, లేదంటే ఓటును తొలగించాల్సి వస్తుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఫారాలను వెంటనే పూర్తి చేసి బీఎల్‌ఓలకు అందజేయాలని ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఫారాల్లో ఎలాంటి తప్పులు లేకుండా పూరించి, పాస్‌పోర్ట్ సైజు ఫొటోను అతికించి అందించాలని కోరారు. 2002 ఓటరు జాబితాలో ఓటర్ వివరాలు ఉన్నట్లయితే తప్పనిసరిగా నింపాలని, ఒకవేళ అటువంటి వివరాలను లేకపోయినా ప్రస్తుత వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాలను నింపాలని స్పష్టం చేశారు. 'సర్' ప్రక్రియ జూన్ 25న ప్రారంభమైందని, మరో పది రోజుల్లో ముగుస్తుందని పేర్కొన్నారు.

# డిశ్చార్జ్ అయిన పవన్ కళ్యాణ్



**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ముంబైలోని ప్రసిద్ధ కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రి నుండి బుధవారం డిశ్చార్జ్ అయ్యారు. గత కొంతకాలంగా భుజాల నొప్పితో బాధపడుతున్న ఆయన, తన రెండు భుజాలకు శస్త్రచికిత్స చేయించుకోవడం కోసం ఈనెల 10వ తేదీన ఆసుపత్రిలో చేరిన సంగతి తెలిసిందే. శస్త్రచికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు ఆసుపత్రిలోనే 4 రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకున్న ఆయన, కోలుకోవడంతో వైద్యులు బుధవారం ఉదయం డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపించారు. అయితే, ఇంటికి వెళ్లిన తర్వాత కూడా మరికొన్ని రోజుల పాటు ఆయనకు పూర్తి బెడ్ రెస్ట్ అవసరమని వైద్య బృందం సూచించినట్లు సమాచారం.

కాగా పవన్ కళ్యాణ్ భుజాల సర్జరీ అనంతరం కోలుకుని, మళ్లీ మునుపటి ఉత్సాహంతో ప్రజాక్షేత్రంలోకి, ప్రజల మధ్యలోకి తిరిగి వస్తారు అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారనే వార్తతో జనసేన శ్రేణులు, కూటమి నాయకులు, ఆయన అభిమానులు సామాజిక మాధ్యమాల వేదికగా 'వెల్ కమ్ బ్యాక్' అంటూ కామెంట్లు పెడుతున్నారు.

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు



**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా, మౌలిక వసతుల రంగాన్ని పరుగులు పెట్టించేలా కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్, ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో మొత్తం 7 ప్రధాన నిర్ణయాలకు ఆమోదముద్ర వేశారు. అందుక సంబంధంచిన నిర్ణయాల వివరాలను కేంద్ర సమాచార, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రెస్‌మీట్‌లో వెల్లడించారు. ముందుకుగా వారణాసిలో సరికొత్త పద్ధతిలో అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు కల్పించేందుకు కేబినెట్ మొదటి రెండు నిర్ణయాల ద్వారా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వరుణ నది ఒడ్డున ర్యాంప్‌లు, లూప్‌లతో కూడిన 43.218 కిలోమీటర్ల పొడవైన 6/4 లేన్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. ఇక నేషన్ హైవే 31 ని, వారణాసి రింగ్ రోడ్‌తో లింక్ చేసే ఈ ప్రాజెక్టును హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రూ.10,998.32 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్నారు.

గ్లోబల్ టెక్ హబ్‌గా భారత్ – సెమికాన్ 2.0, మొబైల్ పిఎల్ఐ

అదేవిధంగా సాంకేతిక రంగంలో దేశాన్ని అగ్రభాగాన నిలిపేందుకు కేబినెట్ మరో మూడు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. సెమికాన్ మిషన్ 2.0లో భాగంగా దేశీయంగా చిప్‌ల తయారీని ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన 'ఇండియా సెమికాన్ మిషన్' రెండో విడతకు కేబినెట్ ఏకంగా రూ.1.27 లక్షల కోట్లను మంజూరు చేసింది. ఇక దేశాన్ని మొబైల్ ఉత్పత్తి హబ్‌గా మార్చే లక్ష్యంతో, మొబైల్ ఫోన్ ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పిఎల్ఐ) స్కీమ్ రెండో విడత కోసం రూ.62,500 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు. ఎరువుల కొరత లేకుండా దేశాన్ని యూరియా ఉత్పత్తిలో స్వావలంబన వైపు నడిపించేందుకు నూతన 'నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ ఫర్ యూరియా'కు ఆమోదముద్ర వేశారు.

రైల్వే నెట్‌వర్క్ ఆధునికీకరణ..

దేశవ్యాప్తంగా రైలు ప్రయాణాన్ని మరింత వేగవంతం చేసేందుకు, సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచేందుకు కేబినెట్ ఆఖరి రెండు నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పలు ప్రధాన మార్గాల్లో రైల్వే ట్రాక్‌ల డబ్లింగ్, నాలుగో రైల్వే లైన్ నిర్మాణ పనులను భారీ ఎత్తున చేపట్టేందుకు ప్రతిపాదనలను ఆమోదించారు. అయితే, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయాలతో దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం సరికొత్త పుంతలు తొక్కనుంది. మౌలిక వసతుల కల్పన, రైల్వేల ఆధునికీకరణతో పాటు సెమీ కండక్టర్ రంగంలో భారత్ స్వయంసమృద్ధి సాధించడమే కాకుండా లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# సీఈవో పోస్టుకు భారీ స్పందన



**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక నిర్ణయం తీసుకుంది. అయోధ్య రామాలయ పరిపాలనా నిర్వహణ, రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ వెలువడిన 24 గంటల్లోనే ఏకంగా 1,000కి పైగా దరఖాస్తులు రావడం సంచలనం సృష్టిస్తోంది. ఈ దరఖాస్తుదారుల్లో అత్యధిక శాతం మంది విశ్రాంత బ్యూరోక్రాట్లు, మాజీ సీనియర్ పరిపాలనాధికారులు ఉండగా, మాజీ ఐపీఎస్ అధికారి అమితాబ్ ఠాకూర్ కూడా ఈ రేసులో ఉన్నట్లు స్వయంగా ధృవీకరించారు. దరఖాస్తు చేసుకోవడానికి జూలై 18 చివరి తేదీ కావడంతో, ఈ సంఖ్య మరికొన్ని వేలకు చేరే అవకాశం ఉందని భావిస్తున్నారు. భారీ సంఖ్యలో వస్తున్న దరఖాస్తుల పరిశీలన, అభ్యర్థుల అర్హతల వెరిఫికేషన్ ప్రక్రియలో సహాయం అందించడం కోసం ఒక సెక్రటరీని నియమించాలని ఎంపిక కమిటీ నిర్ణయించింది.

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ప్రమోద్ కోహ్లీ, లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) విష్ణుకాంత్ చతుర్వేది, శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్ సురేష్ హవారేలతో కూడిన ఈ ముగ్గురు సభ్యుల ఎంపిక కమిటీ జూలై 19న సమావేశమై దరఖాస్తులను సమీక్షించడంతో పాటు ఇంటర్వ్యూ ప్రక్రియను ఖరారు చేయనుంది. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 50 నుండి 70 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. పరిపాలనా రంగంలో కనీసం 20 ఏళ్ల అనుభవంతో పాటు అయోధ్యలోనే నివసించేందుకు సిద్ధంగా ఉండాలి. వీటితో పాటు వారు ఖచ్చితంగా హిందూ మతావలంబీకులై ఉండి, శ్రీరామునిపై అచంచల విశ్వాసం కలిగి ఉండాలని, హిందీ, ఇంగ్లీష్ భాషలపై మంచి పట్టు ఉండాలనే నిబంధనలను ట్రస్ట్ విధించింది. ప్రాథమిక స్క్రీనింగ్ అనంతరం షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులను నేరుగా లేదా అవసరమైతే ఆన్‌లైన్ ద్వారా ఇంటర్వ్యూలకు ఆహ్వానించనున్నారు. కాగా.. జూలై 22న జరగబోయే ఆలయ ట్రస్ట్ సమావేశంలో ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియకు సంబంధించిన ప్రగతి నివేదికను ఎంపిక కమిటీ సమర్పించే అవకాశం ఉంది.

## భారత్‌కు ఊరట.. భారీగా టారిఫ్‌లు తగ్గించిన రష్యా



**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** రష్యాపై మరింత ఒత్తిడి పెంచేలా అమెరికా సెనేటర్లు సవరించిన సరికొత్త ఆంక్షల బిల్లును ప్రవేశపెట్టారు. అయితే.. రష్యా నుంచి ముడి చమురు, గ్యాస్‌ను భారీగా దిగుమతి చేసుకుంటున్న భారత్, చైనాతో పాటు ఇతర దేశాలకు విధించాలనుకున్న భారీ టారిఫ్‌లను (సుంకాలను) ఈ కొత్త బిల్లులో గణనీయంగా తగ్గించడం గమనార్హం. దివంగత అమెరికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం రూపకల్పన చేసిన ఈ ద్వైపాక్షిక బిల్లు.. రష్యా ఆదాయ వనరులపై దెబ్బకొట్టడంతో పాటు రష్యా ఇంధనంపై ఆధారపడే దేశాలు ఆ దిగుమతులను తగ్గించుకునేలా ప్రోత్సహించే లక్ష్యంతో తీసుకువచ్చారు.

టారిఫ్‌లు 500% నుండి 100% కి తగ్గింపు

ఈ సవరించిన ప్రతిపాదన ప్రకారం.. రష్యా నుంచి అత్యధికంగా చమురు, సహజ వాయువును కొనుగోలు చేసే మొదటి ఐదు దేశాలపై విధించే గరిష్ట సుంకాన్ని 100 శాతానికి తగ్గించారు. మునుపటి బిల్లులో దీనిని ఏకంగా 500 శాతంగా ప్రతిపాదించగా, ఇప్పుడు దానిని భారీగా తగ్గించడం భారత్ వంటి దేశాలకు పెద్ద ఉపశమనం కానుంది. రష్యా గ్యాస్ ఎగుమతుల్లో 15 శాతం కంటే తక్కువ దిగుమతి చేసుకుంటూ.. ఆ దిగుమతులను తగ్గించుకోవడానికి గణనీయమైన చర్యలు తీసుకుంటున్న దేశాలకు ఈ బిల్లులో ప్రత్యేక మినహాయింపు ఇచ్చారు. దీనివల్ల జపాన్, ఫ్రాన్స్, హంగేరి, బెల్జియం వంటి దేశాలకు ప్రయోజనం చేకూరనుంది. సెనేట్ వర్గాల సమాచారం ప్రకారం.. రష్యా క్రూడాయిల్‌ను అత్యధికంగా కొనుగోలు చేస్తున్న దేశాల్లో భారత్, చైనా, స్లోవేకియా, హంగేరి, అజర్‌బైజాన్ ఉన్నాయి. అలాగే రష్యా గ్యాస్‌ను ఎక్కువగా కొనుగోలు చేసే దేశాల్లో చైనా, ఫ్రాన్స్, జపాన్, హంగేరి, బెల్జియం ముందువరుసలో ఉన్నాయి.

రష్యా 'షాడో ఫ్లీట్'.. బ్యాంకులపై గురి!

టారిఫ్‌ల తగ్గింపుతో ఇతర దేశాలకు ఊరటనిచ్చినప్పటికీ, రష్యాపై కఠిన చర్యలను మాత్రం ఈ బిల్లులో కొనసాగించారు. పాశ్చాత్య దేశాల నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రష్యా రహస్య ఆయిల్ ట్యాంకర్ల వ్యవస్థ పై ఆంక్షలు విధించనున్నారు. రష్యా సెంట్రల్ బ్యాంక్‌తో సహా అక్కడి కీలక ఆర్థిక సంస్థలను లక్ష్యంగా చేసుకున్నారు. రష్యాకు చెందిన ప్రతిష్టాత్మక ఇంధన ప్రాజెక్టులైన యామల్ ఎల్ఎన్‌జీ, ఆర్కిటిక్ ఎల్ఎన్‌జీ 1, 2, 3 లపై గట్టి నిఘా ఉంచనున్నారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అవసరమని భావిస్తే.. రష్యాపై విధిస్తున్న ఆంక్షలను తాత్కాలికంగా నిలిపివేసే లేదా మినహాయింపులు ఇచ్చే విచక్షణాధికారాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఈ బిల్లు కల్పించింది. సౌత్ కరోలినా రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం, డెమొక్రాటిక్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటల్ సంయుక్తంగా 2025 ఏప్రిల్‌లో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అయితే.. ఇటీవల ఉక్రెయిన్ పర్యటనలో ఉన్నప్పుడు అధ్యక్షుడు ట్రంప్‌తో ఈ బిల్లుపై ఒప్పందం కుదిరిందని ప్రకటించిన మరుసటి రోజే లిండ్సే గ్రాహం ఆకస్మికంగా మరణించారు.

# దేవాదుల జలాలను జనగామ జిల్లాకు అందించాలి - తెలంగాణ రైతు సంఘం డిమాండ్

## పెద్ద తండా యం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట రైతుల నిరసన -- పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం



తెలుగు గళం న్యూస్ జనగామ, జూలై 15

దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను లిఫ్టింగ్ చేసి జనగామ జిల్లాకు సాగునీరు అందించడంతో పాటు జిల్లాలోని అన్ని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను వెంటనే నింపాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద తండా యం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట రైతులు బుధవారం నిరసన చేపట్టారు.అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం నాయకుడు భూక్యా చందు నాయక్ మాట్లాడుతూ, సాగునీటి కొరతతో జనగామ జిల్లా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను జిల్లాకు తరలించి రైతులకు శాశ్వత సాగునీటి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే జిల్లాలోని అన్ని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను తక్షణమే నింపి రైతులకు వ్యవసాయానికి అవసరమైన నీటిని అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు నిరంతర సాగునీటి సరఫరా కల్పించడంతో పాటు భూగర్భ జలమట్టాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించి దేవాదుల ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం ఈ డిమాండ్లపై 24 గంటల్లోగా స్పష్టమైన హామీ ఇవ్వాలని, లేనిపక్షంలో గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో దశలవారీగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఝూన్సీ రాజు నాయక్, మూడో వార్డు సభ్యుడు దండు రాజు, మాజీ ఉపసర్పంచ్ గుగులోతు కవిత, వాళ్ల నాయక్, గ్రామ పెద్దలు భూక్యా మోతీలాల్ నాయక్, ప్రభాకర్, లచ్చినారి కుమార్, రాజేష్, తిరుపతి, బాలు, భూక్యా శంకర్ నాయక్, సూర్య, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# జనగామ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా సంస్థలు, పరిశ్రమలు ఏర్పాటు చేయాలి-నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి



తెలుగు గళం న్యూస్ జనగామ, జూలై 15

జనగామ జిల్లా వెనుకబడిన ప్రాంతంగా ఉండటంతో విద్య, ఉపాధి అవకాశాల కోసం యువత హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నదని నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాలో ఉన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా పార్లమెంట్ సభ్యులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు. జనగామ జిల్లాలో పేద, మధ్యతరగతి విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ నాణ్యమైన విద్యా అవకాశాలు అందుబాటులో లేవని అన్నారు.జిల్లాకు కేంద్రీయ విద్యాలయం, నవోదయ విద్యాలయం, ఏకలవ్య రెసిడెన్షియల్ విద్యాసంస్థలు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో జనగామ జిల్లాకు ఈ విద్యాసంస్థలను మంజూరు చేసే అంశాన్ని ఎంపీలు ప్రస్తావించాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే జిల్లాలో పరిశ్రమలు లేకపోవడంతో నిరుద్యోగ యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు.హైదరాబాద్, రంగారెడ్డి వంటి జిల్లాలు భారీ పరిశ్రమలతో వేగంగా అభివృద్ధి చెందుతుండగా, జనగామ జిల్లా మాత్రం అభివృద్ధికి దూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.లింగాల ఘనపురం మండలం కళ్లెం గ్రామంలో టెక్స్టైల్ పార్క్ ఏర్పాటు చేసి, చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాలను కోరారు.దీనివల్ల స్థానిక యువతకు ఉద్యోగాలు లభించడంతో పాటు చేనేత రంగానికి కూడా ఊతం లభిస్తుందని చెప్పారు.కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని జనగామ పీజీ కళాశాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు మంజూరు చేసి మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.జనగామ జిల్లాను విద్య, పరిశ్రమలు, ఉపాధి రంగాల్లో అభివృద్ధి చేసి వెనుకబాటుతనాన్ని తొలగించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కేంద్ర ప్రభుత్వానికి నాగరత్న సేవా సంఘం తరఫున విజ్ఞప్తి చేస్తున్నట్లు బిర్రు ఇస్తారి తెలిపారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన సదస్సుకు మంత్రి సీతక్కకు ఆహ్వానం



తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, జూలై 15

వింగ్స్ ఆఫ్ ఫైర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "మాదక ద్రవ్యాల నిర్మూలన" అవగాహన సదస్సుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి సీతక్కను సంస్థ ప్రతినిధులు ప్రజాభవన్‌లో బుధవారం కలిసి ఆహ్వానించారు.ఈ సందర్భంగా వింగ్స్ ఆఫ్ ఫైర్ ఫౌండేషన్ చైర్మన్ మహమ్మద్ యాకుబ్ పాషా మాట్లాడుతూ, యువతలో మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం, వాటి దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ అవగాహన సదస్సు జూలై 17, 2026న హనుమకొండ జిల్లా కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు, యువత ఈ కార్యక్రమంలో పాల్గొని మాదక ద్రవ్యాల నిర్మూలనకు తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

# వరంగల్ లో ఎంసిపిఐ(యు) పార్టీలో భారీ చేరిక



తెలుగు గళం న్యూస్ వరంగల్, జూలై 15

వరంగల్ నగరంలోని జక్కలొద్దీ ప్రాంతానికి చెందిన సుమారు 300 గుడిసె వాసుల కుటుంబాలు ఎంసీపీఐ(యు) పార్టీలో చేరాయి. మైదం వినోద, చిన్నం విజయ, మైదం వెంకటేశ్వర్లు, తాటికాయల సుస్మిత, బానోతు సుజాత, తాండ్ర కవిరాజు, చంద్రశేఖర్, జేరిపోతుల కమలమ్మ, ఏకు ప్రమీల ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరిక కార్యక్రమం వరంగల్‌లోని ఓంకార్ భవన్‌లో నిర్వహించారు.గణేపాక ఓదేలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంసీపీఐ(యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి నూతన సభ్యులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడిసె వాసులు, కార్మికులు, పేద ప్రజల జీవన హక్కుల పరిరక్షణ కోసం ఎంసీపీఐ(యు) నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి ఇంటి స్థలం, గృహ వసతి కల్పించడం రాజ్యాంగబద్ధమైన హక్కు అని పేర్కొన్నారు.జక్కలొద్దీ ప్రాంతంలో నివసిస్తున్న గుడిసె వాసులకు తాగునీరు, విద్యుత్, రహదారులు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గత నాలుగేళ్లుగా వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పార్టీ క్షేత్రస్థాయిలో ఉద్యమాలు కొనసాగిస్తుందని, ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.పార్టీలో చేరిన గుడిసె వాసులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంసీపీఐ(యు)పై విశ్వాసం ఉంచి చేరారని, వారి హక్కుల సాధన కోసం పార్టీ అండగా నిలుస్తుందని గాదగోని రవి హామీ ఇచ్చారు.కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దరాపు రమేష్, కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, నగర కార్యదర్శి మాలోతు



సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు బాష్పాక రమేష్, నగర నాయకులు దాసరపు అనిల్, రాయినేని ఐలయ్యతో పాటు మైదం శేఖర్, మైదం ఎలీషా, కుమ్మరి కళ, ఎండీ కైసర్, భాగ్యమ్మ, లక్ష్మి, జన్ను శాంత, కొమ్ము పూల్ విజయ, జక్కుల ఐలమ్మ, ఎండీ షాహిదా, కలకోట్ల సునీత, ఎండీ అప్సర తదితరులు పాల్గొన్నారు. గుడిసె వాసులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# యూరియా యాప్ రద్దు చేసి పాత విధానంలోనే ఎరువుల పంపిణీ చేయాలి"

## తెలంగాణ రైతు సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో బొంతు రాంబాబు డిమాండ్"





సత్తుపల్లి,ఆర్ సి,జూలై 15 (తెలుగుగళం) న్యూస్ :

రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న యూరియా యాప్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, గతంలో అమలులో ఉన్న పాత విధానంలోనే యూరియా పంపిణీ చేపట్టాలని తెలంగాణ రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో జిల్లా రైతు సంఘం కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ సీజన్‌లో రైతులకు అత్యంత అవసరమైన సమయంలో యాప్ ఆధారిత పంపిణీ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. నెట్‌వర్క్ సమస్యలు, సర్వర్ లోపాలు, సాంకేతిక అంతరాయాలతో రైతులు గంటల తరబడి ఎరువుల దుకాణాల వద్ద వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్ పనిచేయకపోవడంతో రైతులు పలుమార్లు దుకాణాల చుట్టూ తిరిగినా యూరియా అందని పరిస్థితి నెలకొందన్నారు. సకాలంలో యూరియా అందక పంటల ఎదుగుదల దెబ్బతింటోందని, వ్యవసాయ పనులు ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నారు. గతంలో అమలులో ఉన్న విధానంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు ఎరువులు అందేవని, ఇప్పుడు అనవసరంగా సాంకేతిక విధానాలను ప్రవేశపెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని యాప్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకుని, పాత విధానంలోనే యూరియా పంపిణీ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమైతే రైతుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇచ్చి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరత, పంపిణీ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు.

సమావేశంలో పాల్గొన్నవారు: రైతు సంఘం డివిజన్ కార్యదర్శి రావుల రాజబాబు, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ నాయకులు గంటా శ్రీనివాసరావు, అమర్లపూడి శరత్, టీడీపీ నాయకులు రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జాజిరి శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు మోరంపూడి పాండురంగారావు, సీపీఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, రైతు సంఘం నాయకులు బాల బుచ్చయ్య, మోరంపూడి వెంకట్రావు, కేశవరెడ్డి, రమణ, అరవపల్లి గోపాలరావు, వెంకటేశ్వరరావు, కొత్త సత్యనారాయణ, కుమారస్వామి, వేలాద్రి, కంచర్ల వెంకటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు తడికముల దాస్, చావ రమేష్, మహిళా సంఘం నాయకులు జాజిరి జ్యోతి, చెరుకు రత్నకుమారి, పుష్పవల్లి, రజిని, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కేయూ క్యాంపస్‌లో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం

## క్యాడెట్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన







తెలుగు గళం న్యూస్ హనుమకొండ కేయూ క్యాంపస్

స్థానిక కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) క్యాంపస్‌లో ఎన్‌సీసీ 10వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో 10 రోజుల పాటు నిర్వహించే "యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్-4" (యాక్ట్-IV) ఘనంగా కొనసాగుతోందని క్యాంపు కమాండెంట్ కల్నల్ ఎస్.ఎస్. రాముదురై తెలిపారు. ఈ శిక్షణా శిబిరంలో భాగంగా బుధవారం యూనివర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో క్యాడెట్లకు "రోడ్డు ప్రమాదాల నివారణ -- తీసుకోవలసిన జాగ్రత్తలు" అనే అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన హనుమకొండ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) కె. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు నమోదవుతాయని, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, హెల్మెట్ లేకపోవడం, సిగ్నల్ జంపింగ్, మోడిఫైడ్ డబుల్ సైలెన్సర్లు వాడటం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులు జైలు పాలు కావాల్సి వస్తుందని, కొత్త చట్టాల్లో కఠినమైన మార్పులు వచ్చాయని పేర్కొంటూ ట్రాఫిక్ నియంత్రణ పద్ధతులపై క్యాడెట్లకు సమగ్ర అవగాహన కల్పించారు.శిబిరంలో భాగంగా క్యాడెట్లకు ఎన్‌సీసీ ఆయుధాల వినియోగం, ఫైరింగ్ (కాల్పులు) లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.వీటితో పాటు స్కిల్ డెవలప్‌మెంట్, జాతీయ సమైక్యత, జాతీయ భద్రత అంశాలపై నిపుణులతో ప్రత్యేక ఉపన్యాసాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్ విజయవంతంగా పూర్తి చేసిన క్యాడెట్లకు అంబేద్కర్ హాస్టల్ భవనంలోని క్యాంప్ ఆఫీస్‌లో సర్టిఫికెట్ల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాగా, శిబిరం మూడో రోజు సాయంత్రం క్యాడెట్లకు వివిధ క్రీడా పోటీలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ నెల 13న ప్రారంభమైన ఈ శిక్షణా శిబిరం జూలై 22 వరకు కొనసాగుతుందని, ఇందులో మొత్తం 613 మంది క్యాడెట్లు శిక్షణ పొందుతున్నారని నిర్వాహకులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో క్యాంపు డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారే, సుబేదార్ మేజర్ జయరాం సింగ్, క్యాంపు అడ్జుటెంట్ కెప్టెన్ డాక్టర్ పి. సతీష్ కుమార్, కెప్టెన్ డాక్టర్ ఎం. సదానందం, లెఫ్టినెంట్లు టి. గణేష్, బి. జీవన్, జేసీఓలు సుతారి, రాజేంద్రన్, సోను వానే, అనిల్ జాదవ్, మహమ్మద్ అజమ్ అలీ, మారుతి మద్దం, రామ్నాథ్, గిత్తే, ప్రవీణ్ డాంగ్రే, సూపరింటెండెంట్ అరుణ, దత్తు, ట్రైనింగ్ సిబ్బంది కుమారస్వామి, మహేష్, చీఫ్ ఆఫీసర్లు రవీందర్, భవాని, సజని, కాత్యాయని, విజయ్ కుమార్, దుర్గాప్రసాద్, కమలాకర్, మురళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెలాఖరు నాటికి వైద్య కళాశాల భవన పనులు పూర్తి కావాలి:జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశం





తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల (మెడికల్ కాలేజ్) భవన నిర్మాణ పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసి, పూర్తిస్థాయిలో అప్పగించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో ఆర్ అండ్ బీ, వైద్య కళాశాల,టీజీఎంఐడీసీ అధికారులతో కళాశాల నిర్మాణ ప్రగతిపై ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, వైద్య కళాశాల నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోపు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఇంకా పెండింగ్‌లో ఉన్న మిగిలిన పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని,రోజువారీ ప్రగతిని పర్యవేక్షిస్తూ పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు.కళాశాల భవనంతో పాటు విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, అంతర్గత రహదారుల నిర్మాణం, పారిశుద్ధ్యం వంటి అత్యవసర మౌలిక సదుపాయాలను సమయానికి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ స్పష్టం చేశారు.సంబంధిత ప్రభుత్వ విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే విద్యార్థుల హాస్టల్ భవన నిర్మాణ పనులను కూడా రాబోయే సెప్టెంబర్ నెలాఖరు నాటికి పక్కాగా పూర్తి చేయాలని స్పష్టమైన గడువు విధించారు.ఈ సమీక్షా సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ రమేష్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర రావు, కేపీసీ ప్రత్యేక ఇంజినీర్ శివరామ్, ఇతర విభాగాధికారులు పాల్గొన్నారు.



# ఏపీ ప్రభుత్వ పనితీరును కొనియాడిన కేటీఆర్

దిల్లీ,తెలుగు గళం: ఏపీ ప్రభుత్వ పనితీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. ఎల్‌నినో పరిస్థితుల్లోనూ నీటి సమస్య రాకుండా ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ క్లిష్ట సమయంలోనూ పట్టిసీమ నుంచి నీటిని ఎత్తిపోస్తూ రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తోందని చెప్పారు. ఈ విషయంలో ఆ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత.. తెలంగాణ ప్రభుత్వం ఇవ్వట్లేదన్నారు. సముద్రంలోకి పోయే నీటి వినియోగానికి ఏపీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. దిల్లీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిగడ్డ విషయంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తీరుపై కేటీఆర్ విమర్శలు చేశారు. "గతంలో పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింటే.. ఎన్డీఎస్ఏ పట్టించుకోలేదు. మేడిగడ్డ పిల్లర్ కుంగితే మాత్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. మేడిగడ్డ బ్యారేజీపై నివేదిక ఇచ్చింది ఎన్డీఎస్ఏ కాదు.. ఎన్డీఏ. తెలంగాణలో కోటి ఎకరాలకు పైగా నిషేధిత జాబితాలో చేర్చారు. రెవెన్యూ మంత్రి 30 శాతం వసూళ్లు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలకు చేస్తున్న పనులకు పొంతన లేదు. కాళేశ్వరంపై ఆయన పగబట్టి వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ఇంజినీర్లు ఇచ్చిన నివేదికను బయటపెట్టాలి. గత రెండేళ్లలో కేసీఆర్ ఏ ఒక్కరి పేరు పెట్టి విమర్శలు చేయలేదు. రేవంత్‌కు మాత్రం.. కేసీఆర్ పేరు తలవని రోజు లేదు. రెండు రోజులు దిల్లీలోనే ఉన్న సీఎం.. ఎన్డీఎస్ఏ అధికారులను ఎందుకు కలవలేదు?ఎన్డీఎస్ఏ ప్రాథమిక నివేదికకు.. తుది నివేదికకు చాలా వ్యత్యాసం ఉంది. మేడిగడ్డపై చూపిన శ్రద్ధ.. మిగతా రాష్ట్రాలపై ఎందుకు చూపలేదు?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

# ఆర్ అండ్ బీ నూతన ఈఈ దేవిక చౌహాన్‌కు ఘన సన్మానం



తెలుగు గళం న్యూస్
హనుమకొండ

హనుమకొండ జిల్లా రోడ్లు,భవనాల శాఖ (ఆర్ అండ్ బీ) ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) గా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన దేవిక చౌహాన్‌ను బుధవారం వివిధ రంగాల ముఖ్య నాయకులు, ప్రముఖులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. హనుమకొండలోని ఆర్ అండ్ బీ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ఎన్. నాయక్, రిటైర్డ్ డీఈఓ పోరిక జవహర్‌లాల్, తాజా మాజీ కార్పొరేటర్ లావుడియా రవి నాయక్ తదితరులు నూతన ఈఈకి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు జిల్లాలో రహదారులు,ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.ఇందుకు నూతన ఈఈ దేవిక చౌహాన్ సానుకూలంగా స్పందిస్తూ, విధుల్లో తన వంతు ఉత్తమ సేవలు అందిస్తానని పేర్కొన్నారు.ఈ మర్యాదపూర్వక సన్మాన కార్యక్రమంలో ప్రముఖ నాయకులు లావుడియా పల్లవి రాజు నాయక్, భూక్య శ్రావణ్ నాయక్, మాజీ ఎంపీటీసీ సోము నాయక్, నునావత్ రవీందర్ నాయక్, బానోత్ ఈర్య నాయక్, భూక్యా రాజు నాయక్, భిక్షపతి మరియు బంజారా సంఘాల ప్రతినిధులు, ఆర్ అండ్ బీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మీ ఓటు... మీ హక్కు

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి



తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/జూలై 15

వరంగల్ జిల్లా:మీ ఓటును మీరే రక్షించుకోండి అంటూ పర్వతగిరి మండలంలోని నారాయణపురం, రోలకల్,పర్వతగిరి గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి స్థానిక సర్పంచులు చిధురు శంకర్,దేవి మాంగ్య నాయక్,జంపా నాయక్ లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడుతూ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు ప్రతి ఓటరుకు తప్పనిసరిగా సహకరించాలని కోరారు.లెక్కింపు పత్రాలను పూర్తిగా నింపి,అవసరమైన ధృవీకరణ పత్రాలను జత చేసి బూత్ స్థాయి అధికారికి అందజేయాలన్నారు. ఓటరు జాబితాలో మీ పేరు సక్రమంగా నమోదైందో లేదో నిర్ధారించుకోవాలని,ఒక్క ఓటు కూడా కోల్పోవద్దని తెలిపారు. మీ ఓటును రక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు.ప్రతి గ్రామ పార్టీ అధ్యక్షులు,బూత్ ఏజెంట్లు, ముఖ్య నాయకులు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఒక్కరిని చైతన్యపరచాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి బొట్ల మహేంద్ర, జిల్లా ఉప సర్పంచుల సంఘం ఉప అధ్యక్షులు కొమ్ము రమేష్,ఉప సర్పంచ్ అనిత రమేష్,గ్రామ శాఖ అధ్యక్షులు కుసం రామ్ చందర్, మాంగ్యా నాయక్,పంతు నాయక్, సాంఘిక మాధ్యమ సమన్వయకర్త వంగ సాయి కృష్ణ యాదవ్, నాయకులు అజయ్ రావు, మైనారిటీ నాయకురాలు ఎండి సుల్తానా,బొట్ల వెంకన్న,ముఖ్య నాయకులు,బూత్ ఏజెంట్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి ప్రభుత్వ ప్లీడర్‌ను ఘనంగా సన్మానించిన వివిధ సంఘాల నాయకులు



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా నూతన గవర్నమెంట్ ప్లీడర్ (జీపీ)ను బుధవారం వివిధ స్వచ్ఛంద, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన ఈ భేటీలో అమ్మ ఒడి ఫౌండేషన్ చైర్మన్ ఎల్తూరి శ్రీనివాస్, ఆదిజాంబవ యూత్ గణపురం మండల గౌరవ అధ్యక్షుడు సామర్ల నాగరాజు, ముఖ్య నాయకుడు ఎడ్ల రమేష్ (చెల్పూర్) తదితరులు జీపీకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లాలో న్యాయసేవలను బలోపేతం చేయాలని, నిరుపేదలకు న్యాయపరమైన సహాయం అందించడంలో చొరవ చూపాలని వారు కోరారు.అనంతరం వివిధ రంగాల్లో సామాజిక సేవ చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, యువజన, విద్యార్థి సంఘాల ప్రతినిధులు నూతన ప్రభుత్వ ప్లీడర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గణపురం మండలానికి చెందిన ప్రముఖ నాయకులు ఇంజపల్లి శంకర్, వంశీ, గన్‌పూర్ యూత్ సెక్రటరీ (కార్యదర్శి), విద్యార్థి సంఘం నాయకుడు దుప్పటి అంజి, పలువురు యువజన, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యేఅరూరి




తెలుగు గళం న్యూస్
పర్వతగిరి/జూలై 15

వరంగల్ జిల్లా:పర్వతగిరి మండల పరిధిలోని మూడు బాధిత కుటుంబాలను మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు.పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన గడుదాసు వీరాస్వామి,ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎర్రబెల్లి హరికుమార్,పర్వతగిరి మాజీ జిల్లా పరిషత్ సభ్యులు మాధసి శైలజ– సుధాకర్ తల్లి ఉప్పలమ్మ కుటుంబాలను అరూరి రమేష్ సందర్శించారు.మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ,సభ్యత్వ నమోదు బాధ్యుడు మసూద్,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షులుఎం.మనోజ్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉప అధ్యక్షులు జితేందర్ రెడ్డి,మాజీ మండల పరిషత్ ఉప అధ్యక్షులు మరియు బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర రావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు రంగు కుమార్,మాజీ రైతు బంధు మండల అధ్యక్షులు చిన్నపాక శ్రీనివాస్,మాజీ స్థానిక సంస్థల సభ్యులు,సర్పంచులు,ఉప సర్పంచులు,మండల నాయకులు, కార్యకర్తలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ విద్యాలయ ఆరో తరగతి ప్రవేశాలకు జూలై 31 వరకు దరఖాస్తుల గడువు




తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

వచ్చే 2027--28 విద్యా సంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించే ఎంపిక పరీక్ష (JNVST–2027) నోటిఫికేషన్ విడుదలైనట్లు మామునూర్ పీఎం జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎస్. ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల (జూలై) 31వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వం చేత గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని స్పష్టం చేశారు.దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల జనన తేదీ 01-05-2015 నుండి 31-07-2017 మధ్య ఉండాలని ఆయన వివరించారు.ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశ పరీక్షను రాబోయే నవంబర్ 28న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, మెరిట్ ఆధారంగా ఎంపికైన విద్యార్థులకు జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఉచిత నాణ్యమైన విద్యతో పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. నవోదయ విద్యాలయాల్లో సీబీఎస్ఈ సిలబస్ విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో బోధన ఉంటుందని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల జయశంకర్ భూపాలపల్లి జిల్లా విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ www.navodaya.gov.in ద్వారా జూలై 31 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని, గ్రామీణ మరియు పట్టణ ప్రాంత విద్యార్థులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.ప్రవీణ్ కుమార్ సూచించారు.

# నల్లబెల్లిలో ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం



తెలుగు గళం న్యూస్
వర్ధన్నపేట/జూలై 15

వరంగల్ జిల్లా వర్ధన్నపేట: గ్రామంలోని రైతులు, యువకులు, మహిళలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో నల్లబెల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

బిసిఐ పత్తి ప్రాజెక్టులో భాగంగా ప్రజ్వల్ సంస్థ ఆధ్వర్యంలో, మెడికవర్ మరియు శరత్ ఆసుపత్రుల సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో ఉచిత గుండె పరీక్షలు,ఈసిజి, రక్తపోటు,చక్కెర పరీక్షలు మరియు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ ప్రారంభించారు.మాట్లాడుతూ ఇలాంటి వైద్య శిబిరాలు గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.శిబిరంలో మొత్తం 122 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినందుకు ప్రజ్వల్ సంస్థను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేకల దేవేందర్,గ్రామ పంచాయతీ కార్యదర్శి హుస్సేన్, వార్డు సభ్యులు బిర్రు సుధాకర్,బిర్రు సబిత,ప్రజ్వల్ సంస్థ ప్రతినిధి కందికట్ల స్కైలాబ్ బాబు,సీనియర్ సామాజిక కార్యకర్త గడ్డం యాకయ్య,గ్రామ పెద్దలు,రైతులు, యువకులు,మహిళలు మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం.. వినుకొండ యువతి దుర్మరణం



వినుకొండ రూరల్,తెలుగు గళం: అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్నాడు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడివరం గ్రామానికి చెందిన మక్కెన ప్రసన్న (27) మృతి చెందారు. రైతు కుటుంబానికి చెందిన మక్కెన వెంకటేశ్వర్లు, గోవిందమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో పెద్ద కుమార్తె ప్రసన్న 2022లో ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లారు. అక్కడే ఎంఎస్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నారు. మంగళవారం ప్రసన్న తన ముగ్గురు స్నేహితులతో కలిసి కారులో ఓ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రసన్న అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె స్నేహితులకు గాయాలయ్యాయి. పెద్ద కుమార్తె మరణ వార్త విన్న వెంకటేశ్వర్లు కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. దీంతో ఉమ్మడివరం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు.. మృతురాలి తండ్రికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రసన్న భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకురావాలని కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

## :ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు,కలెక్టర్ రాహుల్ శర్మ







తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి గణపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే ప్రక్రియతో దశాబ్దాలుగా నలుగుతున్న అన్ని రకాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని భూపాలపల్లి శాసనసభ్యులు (ఎమ్మెల్యే) గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. బుధవారం గణపురం మండలం చెల్పూర్ రైతు వేదిక,ధర్మరావుపేట గ్రామాలలో నిర్వహించిన భూముల రీ-సర్వే గ్రామ సభలలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో భూ ఆక్రమణలను అరికట్టి, అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా పక్కాగా హద్దులు నిర్ణయించడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. ఎన్నో ఏళ్లుగా భూమిని సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులందరికీ పట్టాలు అందించి, వారికి ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా, రైతు బీమా, బ్యాంకు పంట రుణాలు అందేలా చేయడానికే ఈ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. సర్వే షెడ్యూల్ ప్రకారం ముందస్తుగా గ్రామాలలో చాటింపు (టామ్ టామ్) ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. భూమిని కన్నతల్లిగా భావించే రైతులు, తమ భూ హక్కుల రక్షణ కోసం ఈ రీ-సర్వే ప్రక్రియను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలంలో ఐదు గ్రామాలను పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి సర్వే చేస్తుండగా,జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొత్తం 70 గ్రామాలను ఈ వినూత్న సర్వే కోసం ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లను రంగంలోకి దించామన్నారు. భూ భారతి చట్టం కింద జరుగుతున్న ఈ రీ-సర్వేలో ప్రభుత్వ భూములు, గ్రామకంఠం, పట్టా భూములకు స్పష్టమైన సరిహద్దులు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.ఈ బృహత్తర కార్యక్రమంలో రెవెన్యూతో పాటు పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, అటవీశాఖ (ఫారెస్ట్) అధికారులను కూడా భాగస్వామ్యం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఏవైనా భూ వివాదాలు ఉంటే వాటిని అధికారుల దృష్టికి తీసుకువచ్చి, ప్రజలందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు.ఈ గ్రామ సభలలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, గణపురం తహశీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ భాస్కర్, స్థానిక సర్పంచులు కావటి రజిత, హైమావతి,వివిధ శాఖల అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై బూత్ ఏజెంట్లతో సమీక్ష సమావేశం

## పాల్గొన్న మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్



తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/జూలై 15

వరంగల్ జిల్లా:వర్ధన్నపేట నియోజకవర్గ పర్వతగిరి మండలంలో బూత్ స్థాయి ఏజెంట్లు, సభ్యత్వ నమోదు మరియు సాంఘిక మాధ్యమ కార్యకర్తలతో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో లెక్కింపు పత్రాలను పూర్తి చేయడంలో ఓటర్లకు అందుబాటులో ఉండాలని బూత్ ఏజెంట్లకు సూచించారు.క్షేత్ర స్థాయిలో ఉంటూ ఓటర్లను కలిసి వారికి సహాయం అందించాలన్నారు. ఈనెల 24 వరకే సమయం ఉందని, వీలైనంత త్వరగా లెక్కింపు పత్రాలను కంప్యూటర్ రూపంలోకి మార్చి ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా బూత్ ఏజెంట్లు బాధ్యత తీసుకోవాలని అన్నారు.ఓటర్లకు ఉన్న సందేహాలు,సమాచారాన్ని వెబ్ సైట్ మరియు ముద్రిత ఓటర్ జాబితాల ద్వారా ఓటర్లకు అందించాలని వివరించారు.ఇప్పటి వరకు పర్వతగిరి మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో ఉన్న బూత్ స్థాయి ఏజెంట్ల నుంచి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై పూర్తి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ,సభ్యత్వ నమోదు బాధ్యుడు మసూద్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వరావు,రంగు కుమార్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షులు మనోజ్ గౌడ్, మాజీ మండల పరిషత్ అధ్యక్షులు లూనావత్ కమల పంతులు,మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉప అధ్యక్షులు జితేందర్ రెడ్డి, సంచాలకులు పట్టపురం ఏకాంతం గౌడ్, సర్పంచులు శ్రీనివాస్, దేవేందర్,కుమార్,వివేక్ మరియు మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తాడిచర్ల డేంజర్ జోన్‌లో భూ సేకరణ విచారణ పారదర్శకంగా జరగాలి

## :జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశం



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

తాడిచర్ల డేంజర్ జోన్ పరిధిలో భూ సేకరణ విచారణ ప్రక్రియను ఎలాంటి తప్పులకు తావులేకుండా పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) కార్యాలయంలో తాడిచర్ల భూ సేకరణపై ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 17వ తేదీ నుండి డేంజర్ జోన్ పరిధిలోకి వచ్చే ప్రతి ఇంటిని క్షేత్రస్థాయిలో పక్కాగా తనిఖీ చేయాలని స్పష్టం చేశారు.నిర్వాసితుల సమగ్ర విచారణ కోసం ఐదు ప్రత్యేక బృందాలను (టీములను) ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ప్రతి టీమ్‌కు ఒక నాయబ్ తహసీల్దార్ పర్యవేక్షకుడిగా ఉంటారని,అందులో గిర్దావర్ (ఆర్ఐ), సీనియర్ లేదా జూనియర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పరిపాలనా అధికారి (విఆర్ఓ), జెన్‌కో ఏఈలు సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు.విచారణాధికారులు ఎలాంటి ఒత్తిళ్లు, పైరవీలకు లొంగకుండా అత్యంత నిష్పక్షపాతంగా తమ విధులను నిర్వహించాలని సూచించారు.డేంజర్ జోన్‌లోని ప్రతి ఇంటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దేశిత చెక్‌లిస్ట్ ప్రకారం బాధితుల కుటుంబ వివరాలను సమగ్రంగా డిజిటల్ రికార్డులలో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో ఏ ఒక్క ఇల్లు లేదా కుటుంబ వివరాలు విస్మరించకూడదని, ప్రతిరోజు పూర్తి చేసిన సర్వే ఫారాలను సాయంత్రానికి కాటారం ఆర్డీఓ కార్యాలయానికి నివేదించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్వో వసంత కుమారి, డీపీఓ శ్రీలత, కాటారం ఆర్డీఓ రవీందర్, విద్యుత్ శాఖ డీఈలు పాపిరెడ్డి, జగదీష్, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసులు, మల్హర్ తహసీల్దార్ రవికుమార్,సర్వే టీముల సభ్యులు పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.